# చరిత్రను తిరగరాసిన ఘనత బాన్సువాడ ప్రజలదే


ఆత్మీక సమ్మేళనానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ బాన్సువాడ
- ధైర్యంగా ఉండండి.. అండగా నేనుంటా..
- పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలి..
- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, డిసెంబర్ 13: స్పీకర్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించిన ఘనత బాన్సువాడ నియోజకవర్గ ప్రజలదే అని బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ బాన్సువాడ అని తెలిపారు. బీర్కూర్ చౌరస్తాలోని ఎస్ఎంబీ గార్డెన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల కృతజ్ఞత సభ, ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తులు అనంతరం అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం ఆనవాయితీ వస్తున్నదని అన్నారు. దానిని బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు తిరగరాశారని చెప్పారు. తన గెలుపునకు రాత్రింబవళ్లు కష్టపడిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి మండలాల వారీగా వచ్చిన మెజార్టీని ఎమ్మెల్యే చదివి వినిపించారు. తాను ప్రమాణ స్వీకారం కోసం అసెంబ్లీకి వెళ్తే.. అందరూ చూశారని, ఏంటని ఆరా తీస్తే.. అసెంబ్లీ స్పీకర్లు ఓడిపోతారు కదా అన్నారన్నారు. తాను గెలువడంతో ఆశ్చర్యం వ్యక్తంచేశారని చెప్పారు. పోలైన ఓట్లలో 50 శాతం ఓట్లు సాధించి తాను గెలుపొందానని అన్నారు. అసెంబ్లీలో బలమైన ప్రతిపక్షంగా ఉన్నామని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీలో కూర్చోగానే రూ.రెండు లక్షల రుణమాఫీ అన్నారని, డిసెంబర్ 9న రైతుబంధు రూ.15వేలు ఒకేసారి వేస్తామని చెప్పారని, ప్రస్తుతం రూ.పది వేలు ఇస్తున్నారని అన్నారు. ముందున్నది ముసళ్ల పండుగ అని తెలిపారు.


ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అత్యధికంగా ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తుల్లో మాజీ సీఎం కేసీఆర్ మొదటి వ్యక్తి కాగా.. తాను రెండో వ్యక్తిని అన్నారు. త్వరలో నిర్వహించే పంచాయతీ ఎన్నికలకు గులాబీ సైన్యం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మీరే నా బలం అని.. ఎవరికీ భయ పడాల్సిన అవసరం లేదని కార్యకర్తలకు సూచించారు. 2014లో రవీందర్‌రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నాడని, ప్రభుత్వం నుంచి ఒక్క డబుల్ బెడ్‌రూం కూడా మంజూరు చేయించి తన స్వగ్రామం ఎల్లాపహాడ్‌లో కట్టించలేదన్నారు. శ్రమించి ఇండ్లు కట్టించిన నాయకుల గురించి మాట్లాడడం సరికాదన్నారు. ఏనుగు రవీందర్‌రెడ్డి చిల్లర రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యేను పలువురు నాయకులు సన్మానించారు.


తిరుమల వేంకటేశ్వర స్వామి సన్నిధిలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వేముల

వేల్పూర్, డిసెంబర్ 13: బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తిరుమలలోని వేంకటేశ్వరస్వామిని బుధవారం దర్శించుకున్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి ఆశీర్వాదం పొందారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని దేవుడిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

## పత్తి కొనుగోళ్లు ప్రారంభం


పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్, డిసెంబర్ 13: మద్నూర్‌లోని మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బుధవారం ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆటోకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రైతులు తాము పండించిన పత్తిని మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా మార్కెట్ కమిటీ అధికారులు పర్యవేక్షించాలని, వ్యాపారులు సైతం సహకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్, నాయకులు విఠల్ గురూజీ, దాదారావు పటేల్, సంగమేశ్వర్, సాహెబ్‌రావు, రాంపటేల్, హన్మాండ్లు స్వామి, సాయిలు, సాయినాథ్, భగవాన్, లక్ష్మణ్, గోపి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రామారెడ్డి మండలం రెడ్డిపేట్‌లో రోడ్డుపై బైఠాయించిన ఆటో డ్రైవర్లు


దోమకొండ తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆటోవాలాలు

# మా బతుకులు ఆగం..

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోడ్రైవర్ల ఉపాధికి దెబ్బ
- మహాలక్ష్మీ పథకాన్ని సవరించాలని డిమాండ్
- రోడ్డెక్కి ఆటోవాలాల నిరసన
- ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం తమ బతుకులను ఆగం చేస్తున్నదని ఆటోవాలాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మహిళలందరూ బస్సుల్లోనే ప్రయాణం చేస్తున్నారని, ఆటోల్లో ఎవరూ ఎక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఆటోల్లో కనీసం పెట్రోల్, డీజిల్ పోసేందుకు కూడా డబ్బులు రావడం లేదని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతున్నదని, మహాలక్ష్మీ పథకాన్ని సవరించాలని వారు కోరుతున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తహసీల్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలను సమర్పించడంతోపాటు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు.

- నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 13


జుక్కల్ తహసీల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన ఆటో యూనియన్ నాయకులు